


**2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 12 అక్టోబరు , 2026 | పేజీలు : 4




## మునుగోడులో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

### నియోజకవర్గ నలుదిక్కుల నుండి వచ్చి ఆడి పాడిన ఆడపడుచులు

### బతుకమ్మ ఆడిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి

**ప్రజాపక్షం/మునుగోడు :** బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది ఆడపడుచులు తరలివచ్చి ఆడిపాడారు.మునుగోడు క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ మహిళలతో కలిసి బతుకమ్మలతో వేడుకల ప్రాంగణానికి చేరుకున్న ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వేద మంత్రాలతో పూజలు చేసి 15 అడుగుల బతుకమ్మకు హారతి ఇచ్చి వేడుకలను ప్రారంభించారు.గుమ్మడి, తంగేడు, గునుగు, బంతి పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల మధ్య మహిళల ఆటపాటలు, జానపద గీతాలతో ప్రాంగణం సందడిగా మారింది. నాటి పల్లె పాటల నుంచి నేటి డీజే పాటల వరకు ప్రతి బతుకమ్మ పాటకు మహిళలతో కలిసి కోమటిరెడ్డి లక్ష్మి బతుకమ్మ ఆడారు.బతుకమ్మ అంటే కేవలం పూల పండుగే కాదని, ఇది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని లక్ష్మి అన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రతి ఆడపడుచు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బతుకమ్మ ఆడే ప్రతి మహిళ వద్దకు వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. అనంతరం మహిళలకు కడుపునిండా భోజన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ఉత్కంఠం

**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. నాలుగో రౌండ్ ముగిసే సమయానికి అమరేందర్‌రెడ్డి 342 ఓట్లకు చేరుకోగా, హేమలత 350 ఓట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. పుల్లారావు 327, సాధించారు. ఇదే సమయంలో మిర్యాల యాదగిరి 317 ఓట్లు, టి. సుధారాణి 339 ఓట్లు, ఆకవరం లతాకుమారి 332 ఓట్లు సాధించారు. అమంచి రాజలింగం 336 ఓట్ల, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి 285ఓట్లతో కొనసాగుతున్నారు. తొలి రెండు రౌండ్లలో స్వల్ప ఆధిక్యంలో ఉన్న హేమలతను మూడో రౌండ్‌లో అమరేందర్‌రెడ్డి అధిగమించడంతో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారింది. మొదటి రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి డాక్టర్ హేమలత 174 ఓట్లతో మొదటి స్థానంలో ఉండగా, గోలి అమరేందర్‌రెడ్డి 173 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కేవలం ఒక్క ఓటు తేడాతో కొనసాగిన పోటీలో మూడో రౌండ్ ఫలితాలు కీలకంగా మారాయి. పలువురు అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా తక్కువగా ఉండటంతో తదుపరి రౌండ్ల ఫలితాలపై అభ్యర్థులు, వారి మద్దతుదారుల్లో ఉత్కంఠ నెలకొంది.రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో మొత్తం ఏడు రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపడుతున్నారు. ఇప్పటివరకు మూడు రౌండ్లు పూర్తికాగా, నాలుగో రౌండ్ లెక్కింపుపై ఆసక్తి నెలకొంది. మిగిలిన రౌండ్లలో ఓట్ల సరళిని బట్టి అభ్యర్థుల ఆధిక్యంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా అమరేందర్‌రెడ్డి, హేమలత మధ్య పోటీ హోరాహోరీగా సాగుతుండటంతో తుది ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అధికారిక తుది ఫలితాలు వెలువడిన తర్వాతే విజేతలపై స్పష్టత రానుంది.

# సర్పంచ్ అయినా.. పూరి గుడిసే దిక్కు

### ప్రజలకు సేవ చేస్తున్నా..సొంతింటి కల మాత్రం నెరవేరని వైనం

### తొలి విడతలో దక్కని ఇందిరమ్మ ఇల్లు.. రెండో విడతపైనే ఆశలు

### అర్హత ఉంటే రాజకీయాలకు అతీతంగా మంజూరు చేయాలి..గ్రామస్తుల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/త్రిపురారం:** గ్రామానికి ప్రథమ పౌరురాలు ఆమె...ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం కృషి చేయాల్సిన బాధ్యత ఆమెపై ఉంది... గ్రామ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తూ, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు...కానీ ఆమె వ్యక్తిగత జీవితంలో మాత్రం పేదరికం వెంటాడుతోంది..కనీసం తలదాచుకునేందుకు పక్కా ఇల్లు కూడా లేక పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్‌గా ఎన్నికైన ఆమెకు సొంతింటి కల ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది.నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ పాపకంటి సుష్మగిరి పరిస్థితి ఇది.

**ప్రజాసేవలో ముందడుగు..సొంతింటి విషయంలో వెనకడుగు**

ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన ఆమె బీఆర్ఎస్ పార్టీ తరపున సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు.గ్రామ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అయితే,ప్రజాప్రతినిధిగా గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఆమె కుటుంబానికి మాత్రం పక్కా నివాసం లేకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు గ్రామ ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రయత్నిస్తుండగా,మరోవైపు తన కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చుకోవాలన్న ఆకాంక్ష నెరవేరకపోవడం ఆమె పరిస్థితిని తెలియజేస్తోంది.

**పూరి గుడిసెలోనే కుటుంబ జీవనం :** ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవనం సాగిస్తున్న సుష్మగిరి కుటుంబం పూరి గుడిసెలోనే కాలం వెళ్లదీస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పేద కుటుంబాలకు పక్కా ఇల్లు ఎంతో అవసరం. వర్షం వచ్చినా, ఎండ తీవ్రత పెరిగినా కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉండేందుకు సొంత ఇల్లు ఎంతో భరోసానిస్తుంది. అలాంటి కనీస వసతి కూడా లేకపోవడంతో ఆమె కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికైనప్పటికీ, వ్యక్తిగతంగా మాత్రం పేదరికం నుంచి బయటపడలేకపోవడం గ్రామస్తులను ఆలోచింపజేస్తోంది.

**అర్హత ఉంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి:పాపకంటి సుష్మగిరి,సర్పంచ్**

గ్రామ ప్రజలు నాపై నమ్మకంతో సర్పంచ్‌గా గెలిపించారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను.అయితే,నా కుటుంబానికి ఇప్పటికీ పక్కా ఇల్లు లేదు.పూరి గుడిసెలోనే నివసిస్తున్నాం. తొలి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. రెండో విడతలోనైనా ప్రభుత్వం నా కుటుంబ పరిస్థితిని పరిశీలించి, పథకం నిబంధనల ప్రకారం నాకు అర్హత ఉంటే ఇల్లు మంజూరు చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు అందాలి.నాకు కూడా సొంతింటి కల నెరవేరుతుందని ఆశిస్తున్నాను.





## ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్థిల్లాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని యాద్గార్‌పల్లి గ్రామంలోని దుర్గామాత దేవాలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక వేడుకల్లో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చేరుకున్న ఆయన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాలు సమాజంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మికతను, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే గొప్ప పండగ అని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ సకల సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్థిల్లాలని, మిర్యాలగూడ ప్రాంతం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు.

## ఆడపిల్లలపై అపోహలు వద్దు



**ప్రజాపక్షం/మోతె :** ఆడపిల్లలపై అపోహలు వద్దని యంవిఎఫ్ మండల ఇంచార్జి వి. లలిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆడపిల్లల సమానత్వ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో బాలికల పట్ల అంతులేని అపోహలు నేటికి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ డి. పద్మ, కమిటి సభ్యులు పూజిత, నందిని, గీతాంజలి, త్రివే ణి, భువనేశ్వరి, ఆయాలు, బాలికలు పాల్గొన్నారు.

## సిఇసి తక్షణమే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఎన్నికల ప్రధాన కమీషనర్ (సిఈసి) జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్‌సర్) ప్రక్రియను నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సిపిఎం అఖిల భారత నాయకులతో పాటు తెలంగాణకు చెందిన పలువురు నాయకులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్‌లో సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి మాట్లాడారు. నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, వెల్పుల వెంకన్న, జె. నరసింహారావు, మద్దెల జ్యోతి పాల్గొన్నారు.



# 24 గంటల విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే ప్రధాన ధ్యేయంతో మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో సుమారు రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్, రైతులతో కలిసి ఆయన ఈ నూతన విద్యుత్ లైన్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలను



వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కి బుద్ధి చెప్పాలి



**ప్రజాపక్షం/మునగాల:** త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ నమోదు చేయించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఈ విషయాన్ని పట్టభద్రులకు వివరించి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చేప్పేలా చూడాలని, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తి విద్యా సమస్యలపై గళం వినిపించాలంటే అర్హులైన విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు విదిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. నాయకులు ఓటర్ నమోదు విషయంలో ఆలసత్వం వహించకుండా గ్రామాలు, వార్డుల వారిగా తిరిగి అర్హులైన పట్టభద్రులందరిని గుర్తించి ఓటర్‌గా నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తొగరు రమేష్, సుంకరి అజయ్‌కుమార్, కందిబండ సత్యానారాయణ, తోగరు సీతరాములు, దిలీప్‌కుమార్, ఉడుం కృష్ణ, వేనేపల్లి రమేష్‌బాబు, షేక్ సైదా, రాజమోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

# రూ.500 కోట్ల నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విశ్వబ్రాహ్మణులైన పంచదాయల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని,విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దాసోజు యాదగిరి చారి, ప్రధాన కార్యదర్శి పెందోట సోము లు ప్రభుత్వాన్ని కోరారు.అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్న తరహాలోనే విశ్వబ్రాహ్మణులకు సైతం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి,వారి ఆర్థిక,సామాజిక అభివృద్ధికి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వంనకు విజ్ఞప్తి చేశారు.పట్టణంలోని విశ్వకర్మ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కమ్మరి,వడ్రంగి,కౌసలి,కంచరి, శిల్పి వృత్తులకు చెందిన విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నూతన మహిళా ఉపాధ్యక్షురాలిగా తవిటి ఇందిరారాణి, కార్యవర్గ సభ్యుడిగా చోల్లేటి యాదగిరి, వివాహపరిచే



వేదిక కన్వీనర్ గా పర్వతం నరేంద్రబాబు ని నియమించారు. నూతనంగా నియమితులైన వారిని నాయకులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీపాద కృష్ణమాచారి,కొండోజు కృష్ణమాచారి,షణ్ముఖచారి,కోశాధికారి తరునోజు భీష్మాచార్య,కార్యవర్గ బాధ్యులు దాసోజు బ్రహ్మచారి,కొల్లోజు ఓంకారచారి,కటకం వెంకటాచారి,పందిళ్ళపల్లి బ్రహ్మచారి, పర్వతం శోభారాణి,శివకోటి హరిప్రసాద్,పర్వతం నరేంద్రబాబు,కూరెళ్ళ రాఘవాచారి,ఉమారాణి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** క్రీడలలో గెలుపు, ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని టిపిసిసి డెలిగేట్ సభ్యులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఎఎన్ఆర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉత్తమ్ పద్మావతి ప్రీమియర్ క్రికెట్ జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో క్రీడాకారులకు మానసిక,



శారీరక, ఐక్యత ఏర్పడుతుందని అన్నారు. జాతీయ స్థాయి క్రీడలు ఒక గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొక్క బిక్షపతి, సర్పంచ్ దున్న శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపిపి బడేటి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసి బాణాల కవిత నాగరాజు, పల్లపు శ్రీనివాస్, ఎఎన్ఆర్ పౌండేషన్ చైర్మన్ నాగేందర్‌రెడ్డి, కాసాని శివ, ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్ఎన్ మూర్తి, నిర్వాహకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండి సార్

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద నక్కనబోయిన లింగస్వామి,అంజలి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నలుగురు నివసించడానికి గూడు లేక ఉన్న ఇల్లు శిథిలావస్థలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరగకుండా అర్హులైన పేదలకు ఇళ్లు వచ్చేలా అధికారులు గ్రామాల్లో పరిశీలన చేయాలని లబ్ధిదారుడు లింగస్వామి కోరారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లను గ్రామ కమిటీల ద్వారా ఎంపిక చేసి రాజకీయ నాయకుల అండదండలతో ఇళ్లు ఉన్నవారికే మంజూరు చేశారని, అర్హులైన వారికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదని, కనీసం రెండో విడతలోనైనా తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గుడిబండ గ్రామ పంచాయితీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.2లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో అవసరమైన పనులను చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జయసింహారెడ్డి, గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి, నాయకులు ఇర్లా నరసింహా రెడ్డి, కుక్కడపు సాయిలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గుండె పరీక్షలు చేయించుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి సంవత్సరానికి ఒకసారి ప్రతి ఒక్కరు గుండె పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వినూత్న ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో షెటిల్ ప్లేయర్‌లకు ఉచిత గుండె వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మందిలో ఎనిమిది మందికి సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ముందస్తుగా గుర్తించి హైదరాబాద్‌కు ఎంజియోగ్రామ్ చేయించుకొని చికిత్స పొందాలన్నారు. మద్యం, పొగ సేవించరాదన్నారు. కనీసం వ్యాయామం, నడక చేయాలన్నారు. శిభిరానికి సహకారం అందించిన ఆసుపత్రి యాజమాన్యం నగేష్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఈసిజి, టూడిఈకో పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.



# జల్సాయే సీరతున్నబిని విజయవంతం చేయాలి..

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; నేడు మండల కేంద్రంలోని జనప్రియ గార్డెన్‌లో జమియతుల్ ఉలేమా ఆధ్వర్యంలో నిర్వహించే జల్సాయే సీరతున్నబి కార్యక్రమంలో ముస్లీం సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జమియతే ఉలామా హింద్ మండల అధ్యక్షుడు మహమ్మద్ నజీరొద్దీన్ మౌలానా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్సాయే సీరతున్నబి మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్ర, వారి బోధనలు, సమాజానికి వారు అందించిన సందేశాలను స్మరించుకుంటూ ఆయన గుణగణాలను కొనియాడుతూ నిర్వహించే ఒక పవిత్రమైన కార్యక్రమంగా నిర్వహించే ఒక ఆధ్యాత్మిక సభ అని అన్నారు.

# తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జయ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకే సొంతమన్నారు. జయ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; కొండమల్లేపల్లి గ్రామం కొండమల్లేపల్లి మండలంగా ఏర్పడి 10 సంవత్సరములు పూర్తయిన సందర్భంగా బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమావత్‌దస్రునాయక్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి బిఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా దస్రునాయక్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్‌ఎస్ సర్పంచ్‌లు రమావత్ దీప్‌లాల్‌నాయక్, రమావత్ తులసిరామ్‌నాయక్, నాయకులు రావుల వెంకటయ్య, మాజీ సర్పంచ్ రమావత శ్రీను పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆసరా

ప్రజాపక్షం/దేవరకొండ; పేద కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఆదివారం పట్టణంలోని శాలిబండకు చెందిన సయ్యద్ నిరంజన్ కుమార్తె వివాహానికి హాజరైన కళ్యాణ్‌నాయక్ తన మిత్రుడు సుజిత్‌తో కలిసి రూ. 20వేలను అందజేయడం జరిగింది. ఆడబిడ్డ పెళ్లి వేళ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ ఇంటికి వచ్చి భరోసా కల్పించిన కళ్యాణ్‌నాయక్‌కు నిరంజన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కమల్, పీటర్ పాల్గొన్నారు.

# క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విజయదశమి దసరా పండగ పురస్కరించుకుని బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పురుషుల, మహిళల వాలీబాల్ టోర్నమెంట్ 2026 ప్రచార గోడపత్రికను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఈ వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ ఎంతో దోహదపడుతుందన్నారు. పురుషుల విభాగంలో ప్రథమ విజేతగా నిలిచే జట్టుకు రూ.30 వేలు నగదుతో పాటు షీల్డ్, ద్వితీయ విజేతకు రూ.25 వేలు నగదుతో పాటు షీల్డ్, తృతీయ విజేతకు రూ.20 వేలు నగదుతో పాటు షీల్డ్, నాల్గవ విజేతకు రూ.15 వేలు నగదుతో పాటు షీల్డ్ అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మహిళల విభాగంలో ప్రథమ విజేత జట్టుకు రూ.20 వేలు నగదుతో పాటు షీల్డ్, ద్వితీయ విజేత జట్టుకు రూ.15 వేలు నగదుతో పాటు షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ ఆదోత్ అశోక్, 15వ వార్డు మాజీ కౌన్సిలర్ మంత్రాల మృణాళ్ రెడ్డి, 35వ వార్డు కౌన్సిలర్ దైద సోమసుందర్, 35వ వార్డు మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్, 19వ వార్డు కౌన్సిలర్ బూడిద సైదులు, బి ఎల్ ఆర్ బ్రదర్స్ ప్రతినిధులు, పలువురు వాలీబాల్ క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు క్రాస్ కోడ్ పుస్తకం ఎంతో ఉపయుక్తం



ప్రజాపక్షం/చండూరు: నూతన న్యాయవాదులకు న్యాయవృత్తిలో రాణించేందుకు క్రాస్ కోడ్ ది మోడరన్ ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హైకోర్టు అడ్వకేట్ ఆకుల వెంకట్రామ్ పటేల్ అన్నారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని రచయిత ,హైకోర్టు అడ్వకేట్ బొమ్మరబోయిన కిరణ్ రచించిన పుస్తకాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల వెంకట్రామ్ పటేల్ మాట్లాడుతూ క్రాస్ ఎగ్జామినేషన్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకోవడంలో ఈ పుస్తకం నూతన న్యాయవాదులకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. న్యాయవృత్తిలో నైపుణ్యాన్ని పొంపొందించుకోవడానికి ఇలాంటి పుస్తకాలు విలువైన మార్గదర్శకాలుగా నిలుస్తాయని చెప్పారు. చిన్న వయసులోనే రచయిత బొమ్మరగోని కిరణ్ న్యాయరంగానికి ఉపయోగపడే పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. జర్నలిజంలో గోల్డ్ మెడలిస్టుగా గుర్తింపు పొందడంతో పాటు ప్రతికల్లో నిరంతరం వ్యాసాలు రాస్తూ పుస్తక రచనలోనూ ముందుకు సాగడం గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి పుస్తకాలను రచించి తన ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు కంచర్ల విశాంత్ , గద్వాల్ గోవింద్ , సీనియర్ పాత్రికేయులు కంచర్ల అంజయ్య , జేరిపోతుల ధనుంజయ్య పాల్గొన్నారు.

# సంగీత సాంస్కృతిక వైభవానికి ప్రతీక స్వరరాగ సుధా



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నవ్య కళానికేతన్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస కల్చరల్ ఏసీ మినీ స్టూడియోలో నిర్వహించిన స్వరరాగ సుధా సంగీత కార్యక్రమం ప్రేక్షకులను మధుర గీతాల అలలలో ఓలలాడించింది. ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు తమ మధురమైన స్వరాలతో ఆనాటి పాత మధుర గీతాలను రసరమ్యంగా ఆలపించి సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. నాటి ప్రముఖ గాయనీ గాయకులను స్ఫూర్తిగా తీసుకుని తమ గాన ప్రతిభను చాటుతూ ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా కళాపోషకు, కళాకారుల ప్రోత్సాహానికి విశేషంగా సహకరిస్తున్న న్యాయవాదులు పేదబోయిన శ్రీనివాస్ యాదవ్, మట్టపల్లి రామచంద్రయ్య, అలుగుబెల్లి భూపతిరెడ్డిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అలాగే మిర్యాలగూడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాదుల చేతుల మీదుగా గాయనీ గాయకులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవ్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమల్ల రామా రంగారావు, కందుకూరి సుదర్శన్, దాసరాజు రమణ కుమార్, రవి, కంబాల శ్రీనివాస్, గాయనీమణులు శ్రీరాణి, రజిని, హైదరాబాద్‌కు చెందిన హరిచందన, ముకుందాపురానికి చెందిన మౌనిక, కళాసేవకులు, కళాపోషకులు, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ధూపాటి మట్టయ్య, మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రాయారావు భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

# హెల్ప్‌డెస్క్‌తో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా పట్టభద్రులకు ఓటు హక్కు నమోదుకును సులభతరం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొర్ర చందునాయక్ మాట్లాడుతూ పట్టభద్రులు చట్టసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవడానికి ఓటు హక్కు కీలక సాధనమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా పలువురు పట్టభద్రులు తమ వివరాలను నమోదు చేసుకొని పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు నల్లవెల్లి శ్రీనివాస్, నవీన్, అంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడిగూడెంను కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని సాగర్ కాల్వ కింద గల ఆర్9, ఎల్34, ఎల్35, ఎల్ 36 లిఫ్టుల కింద ఆయకట్టు కింద గ్రామాలు సాగర నీళ్ల రాకపోవడంతో బోర్లకింద బావుల కింద నాట్లు పెట్టి వర్షాలు రాక కరెంట్ సక్రమంగా రాక నాట్లు పెట్టిన పొలాలు ఎండిపోతున్నాయని బిఆర్‌ఎస్ రైతు సమన్వయ కమిటీ సభ్యులు అనంతుల ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వందల మంది రైతులు నీటి సరఫరా లేని పొలాలను బీడుగా ఉంచి రైతులు దిక్కు తోచని అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. నాన్ ఆయకట్టు గ్రామాల రైతులు చెరువులు నిండక బోరు బావుల కింద పొలాలు చేసి కరెంట్ సక్రమంగా అందక వేసిన పంట పొలాలు ఎండిపోయి లక్షల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయి తీవ్ర ఆవేదనతో కొట్టుమిట్టాడుతున్నారు. పత్తి, కంది, పెసర పంట తదితర పంటలు వేసి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు రాక తదితర పంటలన్నీ రైతుల చేతికందక తీవ్ర ఆవేదనతో అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు.

# మహాలక్ష్మమ్మ తల్లికి పూజలు



ప్రజాపక్షం/చందంపేట; చందంపేట మండల పరిధిలోని సేవాలాల్‌తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మ తల్లిని ఆదివారం పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో జాలే బ్రదర్స్ నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డిలు సుమారు రూ. 65వేల విలువైన మహాలక్ష్మమ్మ తల్లి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి పార్వతి చందునాయక్, మాజీ సర్పంచ్ శ్రీను, అంజయ్య, బాషోజీ సూర్య, తిరుపతిరెడ్డి, వెంకులు, శ్రీను, ఆంజనేయులు, జబ్బర్,స్వామి, మంగు తదితరులు పాల్గొన్నారు.

# డిండి ఆయకట్టు రైతుల పంటలకు నీళ్లు ఇవ్వాల్సిందే...



ప్రజాపక్షం/దేవరకొండ; డిండి ఆయకట్టు రైతుల పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వ కేఎల్ఐ ద్వారా డిండిలోనికి నీటిని తీసుకొచ్చి రైతుల పంటలను కాపాడాలని బిఆర్‌ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిండి ఆయకట్టు పరిధిలోని రైతులు దాదాపు 15వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంటను సాగు చేసుకోవడం జరిగిందని చివరి దశలో వరి పొట్టదశలో ప్రస్తుతం నీరు అవసరం అని ప్రాజెక్టులో నీళ్లు అయిపోయినందున వరి పొలాలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితిలో ఉన్నందున కల్వకుర్తి ద్వారా డిండి ప్రాజెక్టును నింపి రైతులను ఆదుకోవాలని అన్నారు. వ్యవసాయానికి 16 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని, లో వోల్టేజ్ సమస్యతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వలన బోర్లు, బావుల వద్ద పంటలు ఎండిపోతున్నాయని అన్నారు.

# నేడు రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారం

ప్రజాపక్షం/నాంపల్లి : మండల పరిధిలోని టి.పి గౌరారం రైతు వేదికలో సోమవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారి బండారు శివ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడనున్నారని,ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళిక,సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

# రబీ సీజన్ పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/మర్రిగూడ** :రబీ సీజన్ కు పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణపై సోమవారం రైతు వేదికల్లో అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. సహస్ తెలిపారు.మర్రిగూడ,ఎరగండ్ల పల్లి,దామెర భీమనపల్లి గ్రామాల రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తామని, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్ పంటల ప్రణాళిక,అనువైన పంటల ఎంపిక, సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేరేడుచర్ల పట్టణంలోని విజయదుర్గ ఆలయంలో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా సిఐ చరమందరాజు ఆలయ ప్రాంగణంలో అమ్మవారి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, నాదేండ్ల శ్రీధర్, రామ్మోహన్, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి సభ్యులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, పబ్బా ప్రకాశరావు, కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్ రావు, దేవర శెట్టి సోమయ్య, గోపరాజు రాజు, భక్తులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని పాతరేబల్లె శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీశారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం గోపూజతో ప్రారంభమైనట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కూన్‌రెడ్డి కొండారెడ్డి, ఆలయ చైర్మన్లు చల్లా రవీందర్ రెడ్డి, ముమ్మనేని భరత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐలపంగు మాధవి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గడ్డం రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డిని కలిసిన దైద

**ప్రజాపక్షం/నకిరేకల్** : రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని ఆదివారం టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.



# తెలంగాణ తల్లి విగ్రహానికి ఇందిరమ్మ చీర-రాజకీయ దుమారం

### మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆగ్రహం-కేసు నమోదుకు డిమాండ్-పాలాభిషేకం చేసిన బిఆర్ఎస్ శ్రేణులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :స్థానిక ఎన్‌జి కళాశాల ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఇందిరమ్మ చీర కట్టడంపై రాజకీయ దుమారం రేగింది. గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహానికి చీర కట్టడంపై బిఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి స్పందిస్తూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఇలాంటి పనులు చేయడం గర్హనీయమని అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు వెంటనే కేసు నమోదు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని,రాష్ట్ర సంస్కృతి, అమరవీరుల ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. తెలంగాణ ద్రోహులు,తెలంగాణను వ్యతిరేకించే వారు మాత్రమే ఇలాంటి ఘటనలకు పాల్పడతారని, ఉపేక్షిస్తే భవిష్యత్తులో మరిన్ని ఘటనలు జరుగుతాయని హెచ్చరించారు.ఎన్‌టిఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితులపై ఎలాంటి కేసులు పెట్టారో అలాగే వీరిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.పోలీసుల జోక్యంతో మున్సిపాలిటీ సిబ్బంది విగ్రహానికి కట్టిన ఇందిరమ్మ చీరను తొలగించారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో అలంకరించి ఆందోళన తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి,జమాల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ విధానంపై సమగ్ర అధ్యయనం అవసరం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపి వినియోగించే విధానంపై కేంద్ర ప్రభుత్వం తగినంత ముందుచూపుతో వ్యవహరించకపోవడం వల్లే ఆహార భద్రత వ్యవస్థలో ప్రతిష్టంభన ఏర్పడిందని, ఈ విధానంపై వెంటనే పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ నాగేశ్వర్ తెలిపారు. ఆదివారం స్థానిక అనుధితి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సదస్సులో రైతు సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన భారత దేశంలో ఆహార భద్రతపై ఇథనాల్ విధాన ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇథనాల్ వినియోగం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం వంటి లక్ష్యాలు ఉన్నప్పటికీ రైతులకు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు, ఆహార భద్రతకు కలిగే నష్టాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం వల్ల సదరు పంటలకు డిమాండ్ పెరిగి రైతులకు అదనపు మార్కెట్ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అనంతరం రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ మాట్లాడారు. నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జాతీయ రైతు సంఘం మహాసభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, ఆదర్శ రైతు జొన్నలగడ్డ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# తిప్పర్తిలో అహింసా మహా కరుణ శాకాహార ర్యాలీ




**ప్రజాపక్షం/తిప్పర్తి :** మేజర్ గ్రామ పంచాయతీ తిప్పర్తి లో శనివారం అహింసా మహా కరుణ శాకాహార ర్యాలీ ఘనంగా నిర్వహించారు.నల్లగొండ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ,తిప్పర్తి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది.గుండా సరోజనమ్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మిర్యాలగూడ, కోదాడ, చండూరు, నకిరేకల్, సూర్యాపేట నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు గ్రామ వీధుల్లో తిరుగుతూ శాకాహారం వల్ల కలిగే ఆరోగ్య, మానసిక,ఆధ్యాత్మిక ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.జీవనవనం పిరమిడ్ ధ్యాన క్షేత్రం, మామిడాలపాడుకు చెందిన గరికపాటి సుబ్రహ్మణ్యం సారథ్యంలో, దొన్నాదుల సతీష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.ర్యాలీ అనంతరం స్థానిక కృషి ఫంక్షన్ హాల్ లో ముగింపు సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు నలపరాజు శ్రీనివాస్,జిల్లా పీఎస్ఎస్ఎం గౌరవాధ్యక్షుడు భూసాని జగదీశ్వర్ రెడ్డి,భూసాని కృష్ణారెడ్డి,అనంతుల సత్యనారాయణ,సీనియర్ పిరమిడ్ మాస్టర్ మంచుకొండ నాగరాజు,వాసవి క్లబ్ సభ్యులు శ్రీనివాస్,బ్రహ్మదేవర అశోక్,కర్నాటి రాంబాబు,డాక్టర్ అంజయ్య,వాసుదేవరావు,శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీ లోని డాన్‌బోస్కో జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు , విద్యార్థినులు వివిధ రకాలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ కార్లో , ఫాదర్ శౌరి ,ప్రిన్సిపాల్ ఫాదర్ అనూప్ , వైస్ ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ , అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.



# సాగర్‌లో జర్నలిస్టులకు ఏఐ,సోషల్ మీడియా వర్క్ షాప్

### ముఖ్య అతిథిగా మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి రాక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :నాగార్జునసాగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 12న (సోమవారం) జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు.ఆయన సోమవారం ఉదయం 6:30 గంటలకు హైదరాబాద్‌లో బయలు దేరి 9:30 గంటలకు నాగార్జునసాగర్ చేరుకుని,10 గంటలకు వర్క్ షాప్‌ను ప్రారంభిస్తారు.సాయంత్రం 6 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌కు హాజరుకావాలని కోరారు.

# చిట్యాలలో ప్రారంభమైన దేవి నవరాత్రి ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ వేముల



**ప్రజాపక్షం/చిట్యాల :** పట్టణంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి.గణపతి పూజ కలశస్థాపనతో ఉత్సవాలకు నాంది పలికారు. మొదటిరోజు పసుపు ఎరుపు వస్త్రంతో అమ్మవారిని శ్రీబాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఈనెల 20వ తేదీ వరకు రోజుకొక్క అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ అన్ని ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్ప దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ వారికి ముందుగా ఘన స్వాగతం పలికి, సత్కరించారు.అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పందిరి గీత రమేష్,వైస్ చైర్పర్సన్ గుండెబోయిన లక్ష్మి సైదులు,కౌన్సిలర్లు నాగిల్ల సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులు పాటించాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని నేరేడుగొమ్ము ఎస్ఐ నాగేంద్రబాబు అన్నారు. ఆదివారం నేరేడుగొమ్ము మండల పరిధిలోని సాగర్ బ్యాక్‌వాటర్ వైజాగ్ కాలనీ వెళ్లే వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. పర్యాటకులు, ప్రయాణికులను భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి వారం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులను నిర్వస్తామని ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

# డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలి..

**ప్రజాపక్షం/డిండి;** డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో సోమవారం డిండిలో జరిగే మహాధర్నాకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కామేపల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణి చేస్తూ రైతులను కలిశారు. ఈసందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మాధవరం నర్సింహారావులు మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డిండి మండల బిజెపి ఇంచార్జ్ నక్క వెంకటేష్‌యాదవ్, ఐటి సెల్ జిల్లా కన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.